క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంచికచర్ల: కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ, ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫిమేల్)ఒకేషనల్, ఎంఎల్‌టి ఒకేషనల్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ శనివారం ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుకు అభ్యర్థి కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలని, ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫిమేల్)కు బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీకి బీ ఫార్మసీ పూర్తిచేసి ఉండాలని సూచించారు. ఈనెల 15వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 17వతేదీన డెమో, ఇంటర్వ్యూ ఉంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్‌నంబరు 98858 41277లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెనుగంచిప్రోలు(వత్సవాయి): సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారిణి కె.వాణి సూచించారు. పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-1 లో చిన్నారులు, వారి తల్లిదండ్రులకు శనివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగిపడేసిన కొబ్బరి బోండాలను దూరంగా పారవేయడం, నివాస ప్రాంతానికి దగ్గరగా మురుగునీరు నిల్వలు లేకుండా చుసుకోవాలని కోరారు. జ్వరం ఉన్నట్లు అనిపిస్తే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



నందిగామరూరల్: ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆదివారం నుంచి పూర్తి స్థాయి సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న ఆందోళన శనివారం ఏడోరోజుకు చేరింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, యూనియన్ నాయకులు పరిమి రవి, దసవరపు సైదా, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, దాసు, బ్రహ్మం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):గ్రామంలో నిర్మాణంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు రూ.25వేలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు శనివారం నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు చేతుల మీదుగా విరాళం నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పానుగంటి బ్రహ్మనాయుడు, ఎస్సీ సెల్ నాయకులు ఉదయభాను, నాయకులు నంబూరి రవి, మాజీ సర్పంచ్ యానాల గోపీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు



నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాలు ముగిశాయి. ఆలయ అర్చకులు నందిగం సుబ్బారావు శర్మ, కోటేశ్వర శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి శాకంబరీ అలంకరణకు వినియోగించిన ఆకు, కాయగూరలను వినియోగించి 4,500 మందికి నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు ప్రారంభించారు. శాకంబరీ ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఇన్‌చార్జ్ ఈవో పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మంచాల మాధవరావు, చుండ్రు వాసు, శ్రీనివాసరావు, శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాతపై ఎరువుల భారం

- పెరిగిన మందు కట్టల ధరలు
- భారమవుతున్న ఖరీఫ్ సాగు
- ఇబ్బందుల్లో రైతులు



మందు కట్టలు

వత్సవాయి: రైతేరాజు...రైతు లేనిదే దేశం లేదు అంటూ పాలకులు కల్లబొల్లి కబుర్లు చెప్పడమే తప్ప ఆచరణలో రైతుల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. వ్యవసాయం చేసేవారి సంఖ్య ఏటా తగ్గుతున్న ఈ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కూటమి పాలకులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. పైగా రైతులపై సాగుఖర్చుల భారం పెరుగుతున్నప్పటికీ పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప తగినచర్యలు తీసుకుని అన్నదాతకు అండగా నిలబడటంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌నేపథ్యంలో కొద్దిరోజులుగా ఎరువుల ధరలను వ్యాపారులు పెంచినప్పటికీ వ్యవసాయాధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

ప్రధానంగా మిర్చి, పత్తి సాగు..

నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ప్రధానంగా మిర్చి, పత్తి, వరి అధిక విస్తీర్ణంలో సాగుచేస్తారు. వీటితోపాటు మొక్కజొన్న అపరాలను కొద్దిమొత్తంలో సాగుచేస్తారు. ఈ పంటల సాగులో భాగంగా రైతులు మందు కట్టలను భూమిలో చల్లుతారు. గతేడాది అన్నిరకాల పంటలు కలిపి సుమారు 60వేల ఎకరాలకు పైగా సాగుచేశారు.

అధిక ధరలతో అదనపు భారం..

పాలకుల రైతు వ్యతిరేక విధానాలు, ఈ ఏడాది వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆయా పంటల సాగు విస్తీర్ణం గతేడాదితో పోల్చితే బాగా తగ్గనుంది. మిర్చి, పత్తికి తగిన మద్దతు ధర లభించకపోవడంతో పలువురు రైతులు సుబాబుల్, జామాయిల్ సాగు వైపు మొగ్గారు. నష్టాలను తట్టుకోలేక చాలామంది సాగు చేయడం మానేసి చాలామంది కూలీలుగా మారుతున్నారు. సకాలంలో విత్తనాలు అందించడం నుంచి పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేంత వరకు రైతుకు అండగా నిలవాల్సిన పాలకులు ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటంతో వ్యవసాయం రోజు రోజుకు భారమవుతోందని రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ఊపందుకుంటున్న సమయంలో ఎరువుల ధరలను పెంచడం ద్వారా తమపై అధికభారం పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాత నిల్వలకు కొత్త ధరలు వసూలు..

ప్రభుత్వం మందుకట్టల ధరలను ముందుగానే పెంచుతున్నట్లు సమాచారం తెలుసుకున్న వ్యాపారులు పాతధరలతో ఎక్కువ స్టాకును నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం ధర పెరగడంతో పెరిగిన ధరలతో కలిపి అమ్మకాలు సాగిస్తున్నారు. పాతనిల్వలను పాతధరకే ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా ఆవిధంగా చేయడం లేదు. పాత నిల్వలను కొత్త ధరకు అమ్ముతూ రైతుల జేబులకు చిల్లుపెడుతున్నారు. మందుకట్టలను బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా డీఏపీ స్టాక్ లేదనే నెపంతో కొందరు వ్యాపారులు కొరత సృష్టించి అదనంగా రూ.75 వసూలు చేస్తున్నారు. ఇక వ్యవసాయాధికారులు సైతం ఈ ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటం గమనార్హం. ఇకనైనా వ్యవసాయాధికారులు స్పందించి ఎరువుల దుకాణాల యజమానులు పాతస్టాక్‌ను పాత ధరలకే విక్రయించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎరువు	పాతధర	పెరిగినధర
యూరియా	226	300పైనే
డీఏపీ	1450	1500
20-20-0-13	1200	1300
10-26-26	1700	1800
28-28-0	1700	1800
16-16-16	1500	1600
24-24	1900	2000
15-15-15	1450	1500
సూపర్	550	600

వ్యవసాయం చేసే పరిస్థితులు లేవు..



పెరిగిన మందుకట్టలు, పురుగుమందుల ధరలతో రైతులు వ్యవసాయం చేసే పరిస్థితులు కనపడటంలేదు. వీటితోపాటు కూలీలు, ట్రాక్టర్, అరక బాడుగుల కూడా పెరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందింది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ కింద ఎటువంటి పెట్టుబడి సాయం అందించకపోవడం శోచనీయం.

కనగాల రమేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

అధిక ధరలకే విక్రయిస్తే చర్యలు..



వ్యాపారులు దుకాణాల వద్ద ధరల సూచిక బోర్డులు పెట్టాలి. నిర్ణీత ధరల కంటే అదనంగా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. మందుకట్టలు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించే వారి సమాచారం తెలియజేయండి. సమాచారం తెలిపిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతాం.

జి సత్యనారాయణ, వత్సవాయి వ్యవసాయాధికారి

ఉప్పాల హారికపై దాడి హేయమైన చర్య : తన్నీరు



జగ్గయ్యపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ శ్రేణులు దాడిచేయడం హేయమైన చర్య అని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడివాడలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక కారుపై కూటమి నాయకులు దాడిచేసి అద్దాలు ధ్వంసం చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు మంచివికావని హితవు పలికారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయకుండా కాలయాపన చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికే కూటమి నాయకులు ఇటువంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని తన్నీరు హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు:వాహనదారులు రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలని ఎస్‌ఐ అనిల్ సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు తమ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగించరాదని ఆదేశించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురిని గుర్తించి జరిమానా విధించారు.

బిల్లుల భారం తగ్గించాలంటూ సంతకాల సేకరణ



నందిగామలో సంతకాల సేకరణ కార్యక్రమంలో సీపీఎం నాయకులు

నందిగామటౌన్: విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు, తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట కళ్యాణ్ మండిపడ్డారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ పట్టణంలోని 11,12 వార్డుల్లో సీపీఎం పార్టీ నాయకులు శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచి ప్రజలపై రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని మోపిందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను తప్పి స్మార్ట్‌మీటర్‌లను బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయరూ..



నదిలోని సాలాగ్రామ నరసింహస్వామి

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పుష్కర ఘాట్ వద్ద సూచిక బోర్డులు లేకపోవడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఘాట్ సమీపంలోని నదిలో ఉన్న సాలాగ్రామ నరసింహస్వామి వద్ద లోతు ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ చోటుచేసుకున్న ప్రమాదాల కారణంగా గత ఆరేళ్లలో నలుగురు వ్యక్తులు మృతిచెందగా, మరికొంతమందిని అక్కడే అందుబాటులో ఉన్నవారు కాపాడగలిగారు. 2013లో విజయనగరం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే, నదిలోని నరసింహస్వామిని దర్శించుకుని వస్తూ ఒక్కసారిగా మునిగిపోయారు. దీంతో ఒడ్డునున్న గస్‌మెన్ ఆ ఎమ్మెల్యేను కాపాడి ఒడ్డుకు తీసుకురావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గతంలో సూచికబోర్డుల ఏర్పాటుతో పాటు నదిలో లోతు ఎక్కువగా ఉందంటూ మైకు ప్రచారాలు చేసే వారని, ప్రస్తుతం మైకు ప్రచారాలు కూడా లేవని భక్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఘాట్ వద్ద సూచిక బోర్డులు, మైకు ప్రచారం ఏర్పాటుతోపాటు రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం



కంచికచర్ల: స్థానిక ఓసీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 4.30గంటలకు 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నందిగామ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టో పేరుతో కూటమి పాలకులు చేసిన మోసాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని జగన్‌మోహనరావు కోరారు.

అమ్మవారికి సారె సమర్పణ



పల్లగిరిగట్టుపై ఆలయంలో ఆషాడం సారె సమర్పిస్తున్న మహిళా మండలి సభ్యులు

నందిగామ రూరల్:మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని అమ్మవారికి మహిళా మండలి సభ్యులు శనివారం ఆషాఢం సారె సమర్పించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. నందిగామకు చెందిన లలిత విష్ణు వాసవి జ్ఞాన వాహిని మహిళా మండలి సభ్యులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి : సీపీఐ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

జగ్గయ్యపేట: ఆగస్టు ఒకటో తేదీ నుంచి రెండు రోజులపాటు జగ్గయ్యపేటలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో రోడ్డులోని బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయంలో శనివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన డిపో సెంటర్‌లో ఉన్న పిల్లలమర్రి భవన్ నుంచి బలుసుపాడు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రెండోతేదీన ప్రతినిధుల మహాసభ ఉంటుందన్నారు.ప్రజాసమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. మాజీఎమ్మెల్యే పిల్లలమర్రి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జగ్గయ్యపేటను పారిశ్రామిక కారిడార్‌గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, సహాయ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మారిశెట్టి రమేష్, కార్యదర్శులు భోగ్యం నాగులు, షేక్ కరీం షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి యువతది



మాట్లాడుతున్న కేయూ వీసీ ఆచార్య కె.రాంజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతకు ఆలోచనలతో ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే, ప్లేస్‌మెంట్ డే కార్యక్రమాలను శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. రాంజీ మాట్లాడుతూ చదువుని మించిన శక్తి ప్రపంచంలో లేదన్నారు. ప్రయత్నించడం మానుకోవడమే నిజమైన అపజయమని, పరాజయాలను సాకుగా చూపించి నిస్తేజంగా మారటం తగదని విద్యార్థులకు సూచించారు. యువత సాంకేతికత, కమ్యూనికేషన్, సృజనాత్మకతలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో యువత చేతుల్లోనే భవిష్యత్ ఉందని, వారి ఆలోచనలు, కార్యాచరణ దేశ దిశను మార్చగలవన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడతూ డిగ్రీ స్థాయిలో 17 కోర్సుల్లో 579 పట్టాలు, ప్లేస్‌మెంట్‌పరంగా 389 మంది డిగ్రీ విద్యార్థులకు, 124 మంది పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు పాల్గొన్నారు.

14మంది జూదరుల అరెస్ట్

22 బైకులు రూ.22,180 నగదు స్వాధీనం

కంచికచర్ల: పేకాట ఆడినా, నిర్వహించినా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని గొట్టుముక్కల శివారులో సాగుతున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. పేకాడుతున్న 14మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,180 నగదు, 22 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం నందిగామ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిల్లకల్లు సంతలో విజిలెన్స్ తనిఖీలు

చిలకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లులో జాతీయ రహదారి పక్కనున్న జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే సంతపై శనివారం విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. సంతలో మూగజీవాల అమ్మకందారులు, కొనుగోలుదారులతో మాట్లాడి సమాచారం సేకరించారు.రాజమండ్రి, గుంటూరు, కర్నూలు జిల్లాలకు చెందిన వాహనాలకు మార్కెట్ యార్డ్ సిబ్బంది సెస్ రశీదులు ఇవ్వకపోవడాన్ని విజిలెన్స్ అధికారులు గమనించారు. రికార్డులను పరిశీలించడంతోపాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా సంతలో ప్రైవేట్ సిబ్బంది అక్రమంగా రైతుల వద్ద నుంచి డబ్బు వసూలు చేస్తుండటాన్ని గుర్తించి, వారిని మందలించారు. సంతలో సాగుతున్న అక్రమాలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం.

తండ్రీకొడుకులపై కత్తితో దాడి

మంగొల్లు(వత్సవాయి): పాత కక్షల నేపథ్యంలో తండ్రీకొడుకులపై ఓ వ్యక్తి కత్తితో దాడిచేసిన ఘటన శనివారం వత్సవాయి మండలం మంగొల్లులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మంగొల్లు గ్రామానికి చెందిన రాయబారపు నాగేశ్వరరావు, ఏసుబాబు తండ్రీకొడుకులు. వీరికి ఎ.జోజి అనే వ్యక్తికి పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు, ఏసుబాబులు శనివారం సెంటర్‌లో ఉండగా జోజి అప్పటికే జేబులో ఉన్న కత్తితో వారిపై దాడి చేశాడు. వారు అప్రమత్తం కావడంతో పెద్దప్రమాదమే తప్పింది. ఈ ఘటనలో గాయపడిన నాగేశ్వరరావు, ఏసుబాబులను చికిత్సనిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.